ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 17 మార్చి 2024



కోడ్ వస్తోంది.. పదపద!

అది ఓ ప్రభుత్వ వాహనం. అందులో అధికారులు లేరు. కానీ ఓ పూజారిని కూర్చోబెట్టి శ్రీకాకుళం నగరమంతా తిప్పారు. ఎన్నికల కోడ్ వస్తుందన్న ఉద్దేశంతో శనివారం కార్పొరేషన్ సిబ్బందే శంకుస్థాపనలు చేశారు. అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు లేకుండా కేవలం వైసీపీ క్యాడర్, పట్టణ సహాయ ప్రణాళిక సిబ్బందితో కానిచ్చేశారు. అయితే సహాయ పట్టణ ప్రణాళికాధికారి వాహనాన్ని ఓ అర్చకుడికి కేటాయించి అటూ ఇటూ తిప్పేశారు. శంకుస్థాపనల వద్ద పూజలు చేయించారు.

-శ్రీకాకుళం అర్బన్

మోగింది.. నగారా



- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల
- మే 13న పోలింగ్.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- అమల్లోకి కోడ్.. ఎక్కడి పనులు అక్కడే

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికలకు నగరా మోగింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు తేదీలు ఖరారయ్యాయి. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చేసింది. దీంతో అధికారిక పార్టీ ఆధ్వర్యంలో రిబ్బన్ కత్తిరింపులకు.. శంకుస్థాపనలకు.. అధికారిక హోదాలకు కళ్లెం పడింది. కోడ్ అమల్లోకి వచ్చేయడంతో ఎక్కడిపనులు అక్కడి నిలిచిపోవాల్సిందే. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మన రాష్ట్రానికి ఫేజ్-4లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మే 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 25వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్లు పరిశీలిస్తారు. ఏప్రిల్ 29తో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగుస్తుంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపడతారు. దీంతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

జిల్లాలో ఒక ఎంపీ, 8 అసెంబ్లీ స్థానాలకు పోటీ..

జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి, శ్రీకాకుళం, పలాస, నరసన్నపేట, ఇచ్ఛాపురం, టెక్కలి, ఆమదాలవలస, పాతపట్నం, ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు మే 13 ఎన్నికలు జరుగునున్నాయి. జిల్లాలో పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్లే అధికం. మహిళా ఓటర్లు 9,39,891 ఉండగా.. పురుషులు 9,23,498 మంది ఉన్నారు. థర్డ్ జండర్స్ 131 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 18,63,520 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్‌కు 57 రోజుల వ్యవధి ఉండడంతో.. ఈసారి రాజకీయ పార్టీల నేతల ప్రచారాలకు ఎక్కువ సమయం లభించింది. అన్ని ప్రధాన పార్టీల రాష్ట్ర నాయ కులు.. ఆపై అభ్యర్థుల సభలు.. సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉంది. జిల్లాలో టీడీపీకి సంబంధించి టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాలకు అభ్యర్థులను, అలాగే శ్రీకాకుళం ఎమ్పీ స్థానానికి అభ్యర్థిని ఖరారు చేశారు. ఇంకా నాలుగు నియోజకవర్గాల అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వైసీపీ నుంచి అన్నిస్థానాలకూ అభ్యర్థులను ఖరారు చేసేశారు.



రాజీనామా పత్రాలను చూపిస్తున్న సువ్వారి గాంధీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువర్ణ

స్పీకర్‌కు షాక్

- వైసీపీకి సువ్వారి కుటుంబం గుడ్‌బై
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాజీనామా
- సీఎం జగన్ అవినీతికి పట్టం కట్టారంటూ ఆరోపణ

ఆమదాలవలస, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదనే కారణంతో ఆమదాలవలస నియోజకవర్గంలో సువ్వారి కుటుంబం వైసీపీకి గుడ్ బై చెప్పింది. ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్పీకర్ తమ్మినేని సీతారాం పేరును ప్రకటించడానికి నిరసనగా పార్టీని వీడింది. సీఎం జగన్ మాట తప్పి.. మడం తిప్పి.. అవినీతికి పట్టం కట్టారని వైసీపీ సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ ఆరోపించారు. శనివారం ఆమదాలవలసలోని తన కార్యాలయం వద్ద అనుచరులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థుల తీరును ఖండించారు. '2012లో వైసీపీ ఆవిర్భావం నుంచీ పార్టీ బలోపేతానికి కృషి చేశాం. 2019 అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థిగా అవకాశం కల్పించాలని వైసీపీ అధినేత జగన్‌ను కోరాం. 2024లో మీరే అభ్యర్థి అంటూ జగన్ నాకు మాటిచ్చారు. ఇప్పుడు అవినీతిపరుడిని అభ్యర్థిగా ప్రకటించడం బాధాకరం. స్థానిక సంస్థల్లో ఎంపీపీ పదవిని కూడా తుంగలో తొక్కిన తీరు నన్ను, నా కుటుంబ సభ్యులను కలచివేసింది. అందుకే నాతోపాటు నా కుటుంబ సభ్యులు వైసీపీ సభ్యత్వాలకు, పదవులకు రాజీనామా చేస్తున్నామ'ని సువ్వారి గాంధీ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, తాడివలస ఎంపీటీసీ సువ్వారి దివ్య కూడా పదవులకు రాజీ నామా చేశారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగుతామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లగా ఆమదాలవలస నియోజకవర్గంలోని అవినీతి అక్రమాలు వైసీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. సమావేశం అనంతరం కార్యాలయం ఆవరణలో ఉన్న వైసీపీ జెండాను, ఫ్లెక్సీలను తీసివేశారు. పట్టణ శివారున ఉన్న మురుగునీటి కాలువలో వాటిని పడేశారు. కార్యక్రమంలో సువ్వారి సువర్ణ, సువ్వారి దివ్య, యువ నాయకులు సత్యనారాయణ, అనీల్‌కుమార్, వైకుంఠరావు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం

- వలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు ఎన్నికల విధులకు దూరం
- హెల్ప్‌లైన్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- సరిహద్దుల్లో చెక్‌పోస్టులు
- శివానీ కళాశాలలో ఓట్ల లెక్కింపు
- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా.. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహిస్తామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన సందర్భంగా శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు, నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వివరించారు. ఇలా.. 'ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. ఓట్ల లెక్కింపు ముగిసే వరకు కోడ్ అమల్లో ఉంటుంది. ఎన్నికల విధుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వలంటీర్లను, కాంట్రాక్టు ఉద్యోగులను వినియోగించం. జిల్లాలో మొత్తం 18,63,520మంది ఓటర్లు ఉన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. ఓటు మరోచోట నుంచి ఇక్కడకు బదిలీ చేసుకునేందుకు(ఫారం-6) అవకాశం కల్పించాం. అలాగే 2,357 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశాం. ఎన్నికల నిర్వహణకు 16,978 మంది సిబ్బందిని వినియోగిస్తాం. అదనంగా పదివేల మంది బందోబస్తు ఉంటుంది.

పోస్టర్లు 24 గంటల్లో తొలగిస్తాం

కోడ్ అమల్లోకి రావడంతో.. ప్రజా ప్రతినిధుల ఫొటోలతో ఉన్న బ్యానర్లును, స్టిక్కర్లను, పోస్టర్లను తొలగిస్తున్నాం. 24 గంటల్లో తొలగింపు ఉంటుంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా.. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో హోర్డింగ్‌లను, బ్యానర్లును తొలగించాలి. అలాగే విగ్రహాలకు ముసుగులు వేస్తున్నాం. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామ'ని కలెక్టర్ తెలిపారు.

● ఖర్చు పర్యవేక్షణకు కమిటీ

ఎన్నికల్లో అభ్యర్థులు పెట్టే ఖర్చులను కమిటీ పర్యవేక్షిస్తుంది. అభ్యర్థి తరపున మరొకరు ఖర్చు చేయరాదు. ముద్రించిన ప్రచార కరపత్రాలపైనా ప్రింటర్స్ పేరుతోపాటు.. ముద్రించిన వారి వివరాలు ఉండాలి. మొత్తం ప్రక్రియను 24 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పరిశీలిస్తాయి. 24 స్టాటిక్ సర్వేలియన్స్ టీమ్స్‌ను అదనంగా నియమించాం. 8వీడియో బృందాలను ఏర్పాటుచేశాం. వాహనాలకు జీపీఎస్‌ను పెట్టి స్క్వాడ్ పనితీరునూ పరిశీలిస్తాం.

● ప్రతి అభ్యర్థి నిబంధనలు పాటించాల్సిందే..

ఎన్నికల కోడ్ ప్రకారం.. ప్రతి అభ్యర్థి నిబంధనలు పాటించాల్సిందే. అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా లేదా జాయింట్ ఖాతా ప్రారంభించి లావాదేవీలు జరపాలి. నిబంధనలు అతిక్రమించినవారిపై చర్యలుంటాయి. సోషల్‌మీడియా తప్పుడు వార్తలను, సమాచారాన్ని ప్రచారం చేసినా.. చర్యలు తీసుకుంటాం. ఓటర్లు అందరూ ఎన్నికలపై అవగాహన పెంచుకోవాలి. దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాం.

● వచ్చే నెల 18 నుంచి నామినేషన్లు స్వీకరణ

మే 13న ఎన్నికలు జరుగునున్నాయి. ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు వరకు నామినేషన్లు స్వీకరిస్తాం. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తాం. అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.25వేలు చెల్లించాలి. ఎస్సీ అభ్యర్థులైతే రూ. 10వేలు చెల్లిస్తే చాలు. అఫిడవిట్ తప్పనిసరిగా జతచేయాలి. జూన్ 4న శివానీ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఫలితాలు వెల్లడిస్తాం. ఎక్కడా అక్రమాలు జరగకుండా.. నిఘా పెంచాం. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపడతారు. స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించేందుకు సమగ్ర చర్యలు తీసుకున్నాం' అని కలెక్టర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్

'ఓటర్ల కోసం.. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా అమలు చేసేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశాం. హెల్ప్‌లైన్ నంబర్ **1950.** ఉదయం 10గంటల నుంచి 5.30 గంటల వరకు పనిచేస్తుంది. టోల్‌ఫ్రీ నెంబర్ **18004256625** కూడా వినియోగించుకోవచ్చు. జిల్లా కంట్రోల్ రూమ్ **08942- 240606, 295084** నంబర్లను సంప్రదించవచ్చు. కంట్రోల్ రూమ్ కలెక్టరేట్‌లో ఉంటూ పర్యవేక్షిస్తా'మని కలెక్టర్ తెలిపారు. .

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా

కలెక్టరేట్, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, ఎస్పీ రాధిక పాల్గొని మాట్లాడారు. 'ఒడిశా సరిహద్దు వెంబడి దాదాపు 112 కి.మీ. మేర శ్రీకాకుళం జిల్లా ఉంది. ఇరు రాష్ట్రాల వెంబడి 52 రహదారుల ద్వారా రాకపోకలు జరుగుతున్నాయి. ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. నిరంతరం పెట్రోలింగ్ టీమ్‌లు తిరుగుతున్నాయి' అని వారు తెలిపారు. కార్యక్రమంలో జేసీ నవీన్, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, ఆర్డీవో గణపతిరావు, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డ్వామా పీడీ చిట్టిరాజు, డీపీవో వేంకటేశ్వర్లు, గృహనిర్మాణ పీడీ గణపతిరావు, డీఎంహెచ్‌వో మీనాక్షి, వ్యవసాయాధికారి శ్రీధర్, సచివాలయాల అధికారి వాసుదేవరావు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థుల ఖరారు

- వ్యతిరేకత ఉన్నా.. ఆ మూడు చోట్ల కూడా పాతవారికే టికెట్లు
- ఆమదాలవలసలో బయటపడిన విభేదాలు
- పార్టీకి రాజీనామా చేసిన ద్వితీయ వర్గం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అధిష్ఠానం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేసింది. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి పేడాడ తిలక్‌ను ప్రకటించింది. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి సిట్టింగ్‌లకే ప్రాధాన్యమిచ్చింది. శ్రీకాకుళం - ధర్మాన ప్రసాదరావు, ఆమదాలవలస - తమ్మినేని సీతారాం, పలాస- సీదిరి అప్పలరాజు, నరసన్నపేట - ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం - రెడ్డి శాంతి, ఎచ్చెర్ల- గొర్లె కిరణ్‌కుమార్‌లను ఖరారు చేసింది. టెక్కలి - దువ్వాడ శ్రీనివాస్, ఇచ్ఛాపురం- పిరియా విజయను ప్రకటించింది. చాన్నాళ్ల నుంచీ పాతపట్నం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని వైసీపీలో లుకలుకలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ మూడుచోట్ల అభ్యర్థుల మార్పు తప్పనిసరిగా ఉంటుందని.. అసమ్మతి వర్గం భావించింది. కానీ.. అధిష్ఠానం ఎటువంటి మార్పులు లేకుండా సిట్టింగ్‌లకే టికెట్‌లను కేటాయించింది. ఈ నేపథ్యంలో శనివారం ఆమదాలవలస నియోజకవర్గంలోని వైసీపీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, పొందూరు మాజీ ఎంపీపీ, తాడివలస ఎంపీటీసీ దివ్య, వైసీపీ యువ నాయకులు సువ్వారి సత్యనారాయణ, సువ్వారి అనిల్.. వైసీపీకి, పదవులకు రాజీనామా చేసేశారు. తమ్మినేనికి టిక్కెట్ ఇవ్వడంపై నిరసనగా అసమ్మతి తెలిపినా.. అధిష్ఠానం పట్టించుకోకపోవడంతో ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. పట్టున్న నాయకుడు వైసీపీ నుంచి వెళ్లిపోవడంతో.. అక్కడ పార్టీ పరిస్థితి ఏమిటన్నదీ లుకలుకలు ఆరంభమయ్యాయి. మరి రెండు మూడురోజుల్లో ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో కూడా రాజీనామాల పర్వం ఆరంభమైనా ఆశ్చర్యపోనక్కర్లేదు.

జిల్లా ఓటర్లు : 18,63,520 మంది

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జండర్స్	మొత్తం
ఇచ్ఛాపురం	299	1,30,130	1,36,961	17	2,67,108
పలాస	284	1,06,465	1,11,329	21	2,17,815
టెక్కలి	315	1,16,880	1,17,555	9	2,34,444
పాతపట్నం	322	1,11,627	1,12,293	11	2,23,931
శ్రీకాకుళం	279	1,34,177	1,36,871	31	2,71,079
ఆమదాలవలస	259	95,629	97,158	15	1,92,802
ఎచ్చెర్ల	309	1,22,164	1,20,740	14	2,42,918
నరసన్నపేట	290	1,06,426	1,06,984	13	2,13,423
మొత్తం	2,357	9,23,498	9,39,891	131	18,63,520

ఊరంతా పెళ్లిపందిరి

- నువ్వలరేవులో సామూహిక వివాహాల సందడి



పెళ్లి వేడుకలకు ముస్తాబైన వధూవరులు, కుటుంబ సభ్యులు, బంధువులు



వజ్రపుకొత్తూరు: నువ్వలరేవులో ఊరంతా పందిర్లు.. ఇంటింటా పెళ్లి సందడి నెలకొంది. శనివారం రాత్రి ఒకే ముహూర్తానికి 61 జంటలు ఒక్కటయ్యాయి. సంప్రదాయం ప్రకారం వధువరుల మేనమామలు వారి ఇంటికి ఆహ్వానం పలికి పెళ్లిపందిరిలో గౌరవంగా శాలువ కప్పుతూ, దుస్తులు బహూకరించారు. పెళ్లి కుమార్తే ఇంటికి సారిసామగ్రితో పాటు అలంకర వస్తువులతో పేరంటాలు వెళ్లి అలంకరించారు. గ్రామంలోని కోనేరు వద్దకు మంగళవాయిద్యాలతో వెళ్లి అక్కడ నుంచి మట్టి, నీటిని తీసుకువచ్చి వధువరులను మంగళస్నానాలు చేయించారు. చెరువు వద్ద వధువరులు దాసుడు, డొంబురు, మార్కండేయులు ఆశీర్వాదాలు తీసుకున్నారు. సాయంత్రం మంగళవాయిద్యాలు. స్నేహితులతో కలిసి గ్రామంలో ఉన్న 43 వీధులను తిరుగుతూ పెళ్లి కుమారులు తన పెళ్లికి ఆహ్వానించారు. అనంతరం వరుడు బంధువులు, స్నేహితులతో కలిసి వధువు ఇంటికి చేరుకున్నారు. శనివారం రాత్రి 1.55 గంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు.



లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయాధికారి జేప మౌలానా

జాతీయ లోక్ ఆదాలత్‌లో 1782 కేసులు పరిష్కారం

గుజరాతీపేట, మార్చి 16: జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌తో 1,782 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, కొత్తూరు, పొందూరు కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించామన్నారు. సివిల్‌కు సంబంధించి 130 కేసులు, క్రిమినల్‌వి 1,555, ఇతర కేసులు 97 పరిష్కరించామని తెలిపారు.

పక్కాగా.. పది పరీక్షలు

- రేపటి నుంచి ప్రారంభం
- 145 కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 30,574 మంది విద్యార్థులు



గుజరాతీపేట/ కలెక్టరేట్, మార్చి 16: జిల్లాలో ఈ నెల 18 నుంచి 30 వరకు నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 28,982 మంది, ప్రైవేటు విద్యార్థులు 1,592 మంది మొత్తం 30,574 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 145 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నాం. రోజువిడిచి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులను 8.45 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష సమయం పూర్తయిన తర్వాతే బయటకు విడిచిపెడతారు. ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాలను ఆదివారం మరోసారి తనిఖీ చేయాలి. లోటుపాట్లు ఉంటే వెంటనే చక్కదిద్దాలి. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు పరీక్షల నిర్వహణ సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకువెళ్లరాదు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు, ఇతర అధికారులకు సైతం నిబంధన వర్తిస్తుంది. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసరమైన మందులతో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. మాస్ కాపీయింగ్ నిరోధించేందుకు ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామ'ని తెలిపారు. పరీక్షల విషయాలకు సంబంధించి కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, **94940 94904** నెంబరు ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

అరసవల్లి: పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి ఏ.విజయకుమార్ తెలిపారు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేకంగా బస్సులను నడుపుతామని, విద్యార్థులు కేవలం హాల్‌టికెట్ చూపించి ప్రయాణం చేయవచ్చన్నారు.

రక్త నిల్వల్లేవ్

- రెండు ఓ పాజిటివ్ బ్యాగులకు మాత్రమే పరిమితం
- ఇదీ జిల్లా కేంద్రాసుపత్రిలో తీరు
- రోగులకు తప్పని ఇబ్బందులు



(టెక్కలి)

టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో రోగులకు అరకొర వైద్యసేవలు అందుతున్నాయి. పేరుకే 200 పడకల పెద్ద ఆస్పత్రి. కానీ, ఆశించినస్థాయిలో సేవలు అందక, రక్తనిల్వలు అందుబాటులో లేక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదనే విమర్శలు ఉన్నాయి. రక్తనిల్వలు కేంద్రం, ప్రత్యేక వైద్యులు, వైద్య సిబ్బంది, అవసరమైన స్టోరేజ్ పాయింట్ సామగ్రి అన్నీ ఉన్నా.. ఇక్కడ రక్తనిల్వలు మాత్రం లేవు. బుధవారం నాటికి ఈ ఆస్పత్రిలోని బ్లడ్‌స్టోరేజ్ పాయింట్‌లో రెండే రెండు ఓ పాజిటివ్ బ్యాగులు ఉండడం ఇక్కడ పరిస్థితికి అద్దం పడుతోంది. రోగికి ఆపరేషన్ సమయంలో అవసరమైన రక్తనిల్వలు కోసం వైద్యులు శ్రీకాకుళంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్- రిమ్స్)కు ముందుగా ఇండెంట్ పెడతారు. అక్కడ ఉంటే ఇస్తారు.. లేదంటే లేదు. టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో నెలకు వందకుపైగా సిజేరియన్లు, తరచూ రోడ్డు ప్రమాదాల కేసులు వంటివి నమోదవుతున్నా ఇక్కడ రక్తనిల్వలు పరిస్థితి దయనీయం. వాస్తవానికి రక్తనిధి కేంద్రంలో కనీసం ఓ పాజిటివ్, ఏ పాజిటివ్, బి-పాజిటివ్, ఏబీ-పాజిటివ్ వంటి రక్తనిల్వలు ఉండాలి. అవి లేకపోవడంతో వైద్యులు పలు కేసులు రిఫర్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.



టెక్కలిలో రక్తనిల్వలు లేని స్టోరేజ్ పాయింట్

● ఇక 15 రోజుల కిందటే జిల్లా కేంద్రాసుపత్రికి బ్లడ్‌బ్యాంక్ (రక్త సేకరణ కేంద్రం) మంజూరైనా బాలారిష్టాలు తప్పడం లేదు. బ్లడ్‌బ్యాంక్‌కు సంబంధించి అదనపు వైద్యులు, సాంకేతిక సిబ్బంది, హెల్పర్లు నియమించాల్సి ఉన్నా ఆ పరిస్థితి లేదు. హెచ్‌ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్ఏజీ, మలేరియా, బీడీఆర్ఎల్ తదితర రకాల పరీక్షలు చేసేందుకు అవసరమైన కిట్లు, ఎలీసా టెస్ట్ ప్రాసెస్ కిట్లు కూడా లేవు. రక్త సేకరణకు అవసరమైన ఎంటీ బ్యాగ్స్ కూడా రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అత్యవసర సమయాల్లో రక్తనిల్వల కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు వద్ద ప్రస్తావించగా 15రోజుల కిందటే రక్తనిధి కేంద్రం మంజూరైందని తెలిపారు. కొంతమేర సామగ్రి రావాల్సి ఉందన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో రక్తనిధి కేంద్రం పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్న దృశ్యం

కోడ్ ఎఫెక్ట్.. ఫ్లెక్సీల తొలగింపు

● విగ్రహాలకు ముసుగులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేయడంతో అధికార పార్టీ ప్రచార హోర్డింగ్‌లను తొలగిసుట్ట న్నారు అధికారులు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగరంతోపాటుగా.. జిల్లాలో పలుచోట్ల ఉన్న సిద్ధం పోస్టర్లును దాదాపుగా తొలగించారు. అలాగే ప్రధాన కూడళ్లలో ఉన్న వైఎస్ఆర్, ఎన్టీఆర్, ఎర్రన్నాయుడి విగ్రహాలకు ముసుగులు వేశారు. నగరమంతా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ రాధిక, పోలీసు బృందం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసిందన్న విషయాన్ని ప్రజలు గ్రహించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.



ఫెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న కేంద్ర బలగాలు

శ్రీకాకుళం క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా కేంద్ర దళాలు జిల్లాలో పని చేస్తాయని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఈ మేరకు శనివారం 150 మంది రిజర్వ్ పోలీసు దళాలు (ఆర్పీఎఫ్) తో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి చేపట్టిన ఫ్లాగ్‌మార్చ్ కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ప్రారంభించారు. పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ఫ్లాగ్‌మార్చ్ డే అండ్ నైట్ కూడలి మీదుగా ఏడురోడ్ల జంక్షన్, పాతబస్టాండ్ వరకు, తిరిగి ఎస్పీ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేంద్ర దళాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగానే జిల్లాలో ఫ్లాగ్‌మార్చ్‌లు, రూట్ మార్చ్‌లు చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు వంటివి నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. జిల్లా పరిస్థితులు భౌతిక స్వరూపం, స్థితి గతులను కేంద్రా దళాలకు మ్యాప్ ద్వారా ఎస్పీ వివరించారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో ఏఎస్పీ ప్రేమ్ కాజల్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీ నా, ఆర్డీవో జీహెచ్ రంగయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా, డీఎస్పీలు వై.శృతి, ఎల్.శేషాద్రినాయుడు, సీఐలు ఎల్.సన్యాసినాయుడు, అవతారం, జి.మోహన్‌రావు, ఆర్పీఎఫ్ ఎస్పీ, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

కూర్మనాథుని సన్నిధిలో హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు



చిత్ర పటాన్ని అందిస్తున్న ఈవో గురునాథరావు

గార: శ్రీకూర్మంలో కూర్మనాథుని హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు డి.సుబ్రహ్మణ్యం దంపతులు శనివారం దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేదపండితులు ఆశీర్వచనం అందచేశారు. స్వామి వారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని ఆలయ ఈవో గురునాథరావు వారికి అంద చేశారు. ఆలయ చరిత్ర గురించి అర్చకులు వివరించారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలుపించుకుందాం



ఎమ్మెల్యేను కలిసిన జనసేన పార్టీ నాయకులు

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆ పార్టీ నాయకుడు ఎల్.రాజేష్ ఆధ్వర్యంలో రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే బి.అశోక్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ.. ఉమ్మడి పార్టీల నాయకులను కలుపుకుని ప్రచారం చేస్తున్నట్టు స్పష్టం చేశారు.

గెలిచే వ్యక్తికి టికెట్ ఇవ్వాలన్నదే మా అభ్యర్థన

● పార్టీకి ఎప్పుడూ విధేయులుగానే ఉంటాం..

● శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ నాయకులు

అరసవల్లి: గెలిచే వ్యక్తికి టికెట్ ఇవ్వాలన్నదే మా అభ్యర్థన ని, పార్టీకి ఎప్పుడూ తాము విధేయులుగానే ఉంటామని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల జిల్లా పార్టీ కార్యాలయంలో వారు టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, డివిజన్ ఇన్‌చార్జీలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచీ పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో మాజీ మంత్రి గుండ దంపతులు పనిచేస్తున్నార ని, నేటి రాజకీయాల్లో వారు నీతి, నిజాయితీకి చిరునామాగా నిలిచారన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీకోసం వారు పనిచేశారని, అందరినీ కన్నబిడ్డల్లాగా చూసుకున్నారన్నారు. మంత్రి ధర్మాన వంటి బలమైన నాయకుడిని ఓడించి పార్టీ జెండాను ఎగురవేయగలిగే సత్తా కలిగిన గుండ లక్ష్మీదేవికి టికెట్ ఇవ్వాలని అభ్యర్థించడానికే ఎంపీ రామ్మోహన్ నాయుడు ఇంటికి వచ్చామే తప్ప, పార్టీ పట్ల, నాయకుల పట్ల వ్యతిరేకతకు చోటులేదని స్పష్టం చేశారు. అంతిమంగా పార్టీ గెలుపే లక్ష్యమని, క్రమశిక్షణతో పనిచేస్తామని స్పష్టం చేశారు. అసమ్మతి పార్టీ ప్రయోజనాలకు మంచిది కాదనే ఉద్దేశంతో గుండ లక్ష్మీదేవి రాష్ట్ర పార్టీ అధ్యక్షునికి విన్నవించుకున్నారని, పరిస్థితులు చక్కబడాలనే ఉద్దేశమే తప్ప మరేమీ లేదన్నారు. అంతిమంగా పార్టీ ప్రయోజనాలు, గెలుపే ముఖ్యమని గుండ దంపతులు ఎప్పుడూ భావిస్తుంటారని, ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించడం చేయలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జామి భీమ శంకరరావు, చిట్టి నాగభూషణరావు, కోరాడ రమేష్, కవ్వాడి సుశీల, కొమర కమల, రేణంకి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం

● మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుండ

అరసవల్లి: టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి నాలుగు దశాబ్దాలకు పైగా కలిసి పనిచేశానని, నా వ్యక్తిత్వం గురించి ఆయనకు పూర్తిగా తెలుసని, చంద్రబాబు నిర్ణయమే మాకు శిరోధార్యమని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. శనివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు మాటకు తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామని, మాపై అవాస్తవాలను ప్రచారం చేస్తే వారికి మిగిలేది నిరాశే అని స్పష్టం చేశారు. తాము ఏనాడూ పార్టీని వీడమని, పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తాన్నారు. పార్టీ టికెట్ అనేది మనపై నమ్మకంతో, గౌరవంతో మనకు ఇచ్చేది తప్ప, టిక్కెట్ కోసం ఎప్పుడూ కక్కుర్తి పడలేదన్నారు. పార్టీలోని గ్రూపు రాజకీయాలను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లామని, కానీ ఈ విషయంపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ఈ గ్రూపు రాజకీయాలతో తాను నష్టపోయానని, వీటికి తన భార్య లక్ష్మీదేవి కూడా బలి కాకూడదన్నదే తన భావన అని తెలిపారు. ఏదేమైనా పార్టీ నిర్ణయమే ఫైనల్ అని, చంద్రబాబు నిర్ణయం ప్రకారం పార్టీ కోసం, నిజాయితీగా పార్టీ గెలుపు కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు.

ముద్దాయిలకు వసతులు మెరుగుపరచాలి

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట: జైలులో ఉన్న ముద్దాయిలకు వసతులు మరింత మెరుగుపరచాలని జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టుల సముదాయంలోని చాంబర్‌లో జైలులో మౌలిక సదుపాయాల పెంపు విషయ మై శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని జైలు స్థితిగతుల విషయమై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీలకు మెరుగైన వసతులు కల్పించడానికి కావల్సిన ఎస్టిమేట్లు ఆడిగారు. ఏ జైల్లోనైనా ఇంకా వారికి సదుపాయాలు ఎక్కువగా కావల్సి వస్తే వాటి ఎస్టిమేట్లు రూపిందించి జిల్లా న్యాయసేవాధికార సంస్థకు అందజేస్తేపై అధికారులకు వారి విజ్ఞప్తులు పంపించి వసతులు మెరుగుపరిచే ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధిక, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ దివాకర్ నాయుడు, జిల్లా సబ్ జైలు అధికారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్వర్గధామ రథం



రథాన్ని అందజేస్తున్న దాతలు

అరసవల్లి: శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత స్వర్గధామ రథాన్ని శనివారం రిటైర్డు రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం అందజేశారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు కె.సుధీర్ మాట్లాడుతూ.. ఈ ఉచిత సేవలను కావాలనుకునే వారు 90102 73741, 913300 85885, 08942-226555 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ముందుగా రథాన్ని ప్రారంభించి రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావుకు తాళాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పి.శ్రీకాంత్, కల్యాణ చక్రవర్తి, డి.నిక్కు అప్పన్న, ప్రధాన దాతలు సీహెచ్ సుభాషిణి, డి.చంద్రశేఖరరావు, ఎం.కాశీప్రసాద్, ఎం.సీతారామ్మూర్తి, ఎం.సురేష్, శ్యామ్, ఆంజనేయులు, లోకేశ్వరరావు, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రన్న జ్ఞాపకార్థం బెంచీల ఏర్పాటు



బెంచీలను ప్రారంభిస్తున్న గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: మాజీ కేంద్ర మంత్రి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడి జ్ఞాపకార్థం రూరల్ మండలం గేదెలవానిపేట, కసింవలస గ్రామాల్లో 50 వేల విలువై 10 సిమ్మెంట్ బల్లలను టీడీపీ యువనాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు శంకర్ నిర్మించారు. ఈ మేరకు శనివారం బల్లల పనులు పూర్తి కావడంతో వాటిని వినియోగంలోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందరావు, కంచు దశరధ, సర్పంచ్ అప్పలస్వామి, ఎంపీటీసీ వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'50 ఏళ్ల నాటి కల నెరవేరబోతోంది'

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో తూర్పు కాపుల సంక్షేమ సంఘానికి భవనం నిర్మించాలన్న 50 ఏళ్ల నాటి కల ఇన్నాళ్లకు నెరవేరబోతోందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆ సంఘ నాయకులతో కలిసి మామిడి శ్రీకాంత్ విలేఖరులతో మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కావాలని మంత్రి ధర్మానను కోరగా.. సీఎం దృష్టికి తీసుకువెళ్లి సింగుపురం సమీపంలో 50 సెంట్లు ప్రభుత్వ భూమిని తక్కువ వ్యయానికి అందించారన్నారు. ఈ స్థలం సేకరణకు కృషి చేసిన కాపు నాయకులతో పాటు మంత్రులు ధర్మాన, బొత్స సత్యనారాయణ, తహసీల్దార్ వెంకటరావు తదితరులకు రుణపడి ఉంటామన్నారు. సమావేశంలో సంఘ నాయకులు కరిమి రాజేశ్వరరావు, ఎస్కే నాయుడు, జగన్నాథం, మెంటాడ స్వరూప్, హారిక ప్రసాద్, ఇప్పిలి బాబు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాలుగోసారి అసెంబ్లీ బరిలో మామ, అల్లుళ్లు



తమ్మినేని, కూన

ఆమదాలవలస: మాటల యుద్ధంతో ప్రసిద్ధికెక్కిన ఆమదాలవలస నియోజకవర్గంలో మామ, అల్లుళ్లు నాలుగోసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. శనివారం వైసీపీ ప్రకటించిన అభ్యర్థుల్లో జాబితాలో ఆమదాలవలస నుంచి తమ్మినేని సీతారాం ఖరారు చేసింది. టీడీపీ ప్రకటించిన అభ్యర్థుల మొదటి జాబితాలోనే ఇదే నియోజకవర్గ నుంచి కూన రవికుమార్ చోటు దక్కించుకున్నారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం అభ్యర్థిగా తమ్మినేని, టీడీపీ తరఫున రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నుంచి బొడ్డేపల్లి సత్యవతి పోటీపడగా.. సత్యవతి విజయం సాధించారు. అనంతరం 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా రవికుమార్, వైసీపీ అభ్యర్థిగా సీతా రాం, కాంగ్రెస్ అభ్యర్థిగా సత్యవతి పోటీపడగా.. రవికుమార్ గెలుపొంది శాసనసభకు వెళ్లారు. 2019 ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి మామ, అల్లుడు పోటీ పడగా విజయం తమ్మినేనిని వరించింది. మళ్లీ ప్రస్తుతం 2024లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగోసారి మామ, అల్లుళ్లు సీతారాం, రవికుమార్ ఆమదాలవలస బరిలో సై అంటూ సమరానికి సిద్ధమయ్యారు.

ఇచ్ఛాపురానికి వంశధార నీరు అందాలి

సోంపేట: వంశధార నదీ జలాలు జిల్లాలోని అన్ని జిల్లాలకు అందుతున్నప్పటికీ ఒక్క ఇచ్ఛాపురం నియోజకవర్గానికి మాత్రం అందటంలేదని రైతు సంఘ నాయకులు అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు ఏడు వేల ఎకరాలు మెట్ట భూములు ఉన్నాయన్నారు. ఇంతవరకు ఏ నాయకుడు ఇటువైపు చూడలేదన్నారు. చంద్రబాబు హయాంలో రూ.6,326 కోట్లతో పరిపాలన ఆమోదం లభించింది. అనంతరం ప్రభుత్వం 2019 మే 29న నిబంధనల పేరిట ప్రాజెక్టును రద్దుచేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నదుల అనుసంధానంలో భాగంగా వంశధార జలాలు ఇచ్ఛాపురం నియోజకవర్గానికి వచ్చేలే చేసే పార్టీకే నియోజకవర్గ ప్రజలు వెన్నుదన్నుగా నిలుస్తారన్నారు. రైతు సంఘ ప్రతినిధులు ప్రధాన శివాజీ, ఇప్పిలి కృష్ణారావు, ప్రసాద్, దాశెట్టి దాలిబందు, బెందాళం వెంకటేశ్వరరావు ఉన్నారు.

పైడిభీమవరం వద్ద చెక్‌పోస్టు



పైడిభీమవరం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన దృశ్యం

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల కోడ్ శనివారం మధ్యాహ్నం అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దీంతో పైడిభీమవరం వద్ద పోలీసు చెక్ పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అదేవిధంగా పార్టీ నేతలకు సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించే పనిలో అధికార యంత్రాంగం పడింది. నేతల విగ్రహాలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నిబంధనలు మీరితే వాహనాలు సీజ్ చేస్తాం

శ్రీకాకుళం క్రైం: నిబంధనలు పాటించకుంటే వాహనాలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం వాహనదారులను హెచ్చరించారు. శనివారం నగరంలోకి ట్రాఫిక్ నిబంధనలు మీరి సమయపాలన లేకుండా ప్రవేశించిన భారీ వాహనాలను సీఐ పట్టుకుని, అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా సీఐ అవతారం మాట్లాడుతూ.. భారీ వాహనాలు నగరంలోకి ఉదయం 9 గంటల లోపు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 వరకు, రాత్రి 10 గంటల తర్వాత మాత్రమే రావాలని తెలిపారు. పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా నగరంలోకి భారీ వాహనాలు సమయపాలన పాటించకుండా రావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యంగా ఇసుక తరలించే లారీలు సమయపాలన పాటించకపోవడంతో పాటు అతివేగంగా నగరంలోకి ప్రవేశించడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇటీవల నగరపాలక కార్యాలయం ఎదురుగా ఓ పాలన వ్యాన్, ఆటో, కారు ఇలా అతివేగంగా వచ్చి ప్రమాదాలకు గురయ్యాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల అభినందన



పురుషోత్తంనాయుడును సత్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చౌదరి పురుషోత్తంనాయుడును ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్, అమరావతి అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో శనివారం రాత్రి పురుషోత్తంనాయుడును ఎస్‌బీఐ ఉద్యోగ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ సెక్రటరీ వెంకటరమణ, జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చూసుకోండి

అరసవల్లి: ఈ నెల 18 నుంచి 30 వరకు జరుగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా చూసుకోవాలని పోలీసులను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్టు కమిషన్ సభ్యులు గొండు సీతారాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో వేలాదిమంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ద్విచక్ర వాహనాలు, కార్ల ద్వారా పరీక్షా కేంద్రాలకు వెళతారని, వారికి పోలీసులు కేసులు బుక్ చేయడం, ఆకస్మికంగా ఆపడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల పరీక్ష రాయలేక పోయాడన్న పరిస్థితి తలెత్తకూడదన్నారు.

పేషెంట్ రిలేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుజరాతీపేట: డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణ ఎచ్చెర్లలో గల టీటీడీసీలో అందించనున్నట్టు స్పష్టం చేశారు. ఉచితంగా భోజన, వసతి సదుపాయంతోపాటు శిక్షణ పూర్తి చేసిన వారికి కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 2023, అంతకముందు ఇంటర్ బైపీసీ పాసైన వారు 2023-24 విద్యాసంవత్సరంలో బీఎస్సీ పారా మెడికల్ కోర్సులో ఉచితంగా అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 76809 45357 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు జెమ్స్ క్యాంపస్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు

రణస్థలం: రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జె.విజయలక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ.. ఈ ఏడాది ఇంటర్‌మీడియట్ అడ్మిషన్లు పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతి పూర్తి చేయనున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలసి ప్రభుత్వ కళాశాల కోసం వివరించాలని, ప్రతి విద్యార్థిని ప్రభుత్వ కళాశాలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం: మున్సిపాల్టీ పరిధిలో గల పురుషోత్తపురం వార్డులో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి శంకుస్థాపన చేశారు. శనివారం 1, 2వ వార్డుల పరిధిలో గల పెద్దవీధిలో సీసీ రోడ్డు, డ్రైన్, పురుషోత్తపురం కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల తిరుపతి ఏఈ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వాహనాలు ప్రారంభం

ఇచ్ఛాపురం: ఆర్థిక సంఘ నిధులతో కొనుగోలు చేసిన క్యాంపెక్టర్ వాహనం, రెండు ట్రాక్టర్ ఇంజన్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కమిషనర్ ఎన్.రమేష్ శనివారం కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి చైర్‌పర్సన్ వాహనాన్ని నడిపించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పి.మధుమూర్తి, తేజా, జగన్, ప్రేమ్‌కుమార్, ఎన్.లక్ష్మి, ప్రకాష్‌రావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం..

ఇచ్ఛాపురం: వైసీపీ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు అంతా సమష్టిగా కష్టపడి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధిస్తామని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. శనివారం అయ్యప్ప గుడి సమీపంలో పార్టీ కార్యాలయాన్ని జడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ ప్రారంభించి మాట్లాడారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వేలం ఖరారు

కవిటి: మేజరు పంచాయతీ కవిటి మార్కెట్ వేలం పాటను రూ.4.1 లక్షలకు ఖరారైంది. శనివారం సర్పంచ్ పి.లక్ష్మణరావు, ఈవో వీరభద్రస్వామి ఆధ్వర్యంలో వేలం పాటలను నిర్వహించారు. దుకాణాల సముదాయం పాటలను ఖరారు చేశామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 10వ డివిజన్ రాధాకృష్ణ నగర్ కాలనీలో కాలువలు, రోడ్లు, పార్కు, గేట్ తదితర అభివృద్ధి పనులకు శనివారం కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు శంకుస్థాపన చేశారు. అలాగే గొంటి వీధి, సాయిబుల తోట, సోడావారి లేఅవుట్, ప్రకాష్ నగర్ కాలనీలో వివిధ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నల్లి ఆశాదీపిక, రఫీ, చల్లా అలివేలు మంగ, గుడ్ల దామోదర్, బిర్లంగి రామ్మోహన్, చౌదరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చాడకి సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో శ్రీకాకుళానికి చెందిన ఉపాధ్యాయులు, కవి చాడ శ్రీనివాస్‌కి కుసుమ ధర్మన్న కవిపై పరిశోధనా పత్రం సమర్పించినందుకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం తెరవే సభ్యులు, శ్రీనివాస నాట్యమండలి సభ్యులు సంతోష్, మోహన్ గాంధీ, దుర్గాప్రసాద్, అయ్యండి ప్రసాద్, తదితరులు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.



శ్రీకాకుళం క్రైం: పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రాధిక



ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ బాలాజీ తదితరులు



కలెక్టరేట్: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శం

● జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

కలెక్టరేట్: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని డీఆర్వో ఎం.గణపతిరావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు ప్రాణాలను కూడా పణంగా పెట్టిన మహోన్నత వ్యక్తి అని, ఆయన జీవితం ఎప్పటికీ అనుసరణీయమన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రా ఏర్పాటుకు తన ప్రాణాలను అర్పించిన అమరుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఇ.అనూరాధ, సహాయ అధికారి ఎల్.అప్పారావు, కార్యాలయ సిబ్బంది మమత, జి.గణేష్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

శ్రీకాకుళం క్రైం: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎస్పీ జీఆర్ రాధిక కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీ ఎల్.శేషాద్రినాయుడు, ఏవో సీహెచ్ గోపీనాథ్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో..

ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ.. భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో మొదటిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. ఓఎస్డీ సుధాకర్‌బాబు, ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఎఫ్‌వో ఆసిరినాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ముకుందరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు చేసి నివాళులర్పించారు.


సరుబుజ్జిలి: వెన్నెలవలస గిరిజనులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కూన రవికుమార్


బూర్జ:సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు


టెక్కలి: కండ్రవీధిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీని గద్దె దించాలి

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం

భావితరాల భవిష్యత్ కోసం వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించి చంద్ర బాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

టీడీపీలో గిరిజనుల చేరిక

సరుబుజ్జిలి:కొండవలస,చిగురువలస పంచాయతీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పేడాడ రామ్మోహన్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. చిగురువలస పంచాయతీ వెన్నెలవలస గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు శివ్వాల సూర్యనారాయణ, కిల్లి సిద్ధార్థ, లావేటిపూర్ణారావు, అత్తులూరి హరిగిరి, కొర్ను సూర్యనారాయణ, బి.ఉమ, టి.రాంబాబు, లోలుగు నీలంనాయుడు, పైడి మురళీమోహన్, తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు, జగదీష్, ఎండ రామారావు, కొమ్మనాపల్లి రవికుమార్, దవల సింహాచలం పాల్గొన్నారు.

బాబుతోనే అభివృద్ధి: ఆనెపు

బూర్జ: టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకులు మొదలవలస రమేష్, ఆనెపు రామకృష్ణ తెలిపారు.అయ్యవారిపేట, కొరగాం, వైకుంఠపురం, పీఎల్ దేవిపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కడగల కృష్ణ, లంక జగన్నాథంనాయుడు, వావిలపల్లి రామ్‌జీనాయుడు, పైడి సత్య ప్రసాద్, పీరుకట్ల ప్రభాకరరావు, కోడి గోవిందరావు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: సాగర్


ఎల్.ఎన్.పేట: రావిచెంద్రిలో నాయకులతో మాట్లాడుతున్న సాగర్

ఎల్.ఎన్.పేట: గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ పిలుపునిచ్చారు. మండలంలోని రావిచెంద్రిలో కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలన విధానాలతో ప్రజలు విరక్తిచెంది ఎన్నికలు ఎప్పుడువస్తాయా, ప్రభుత్వాన్నిఎపుడు గద్దెదించుదామా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎస్.కిషోర్‌కుమార్, ఎస్.తేజేశ్వరరావు, కె.తిరుపతిరావు, కె. చిరంజీవి ఉన్నారు.

ఫ్యాన్ రెక్కలు ముక్కలవ్వడం ఖాయం: బగాది

టెక్కలి: మరో 56 రోజుల్లో రాష్ట్ర ప్రజలకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుందని, రాక్షసపాలన నుంచి ప్రజలకు విముక్తి కలగనుందని, ఈ ఎన్నికల్లో వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవ్వడం ఖాయమని టీడీపీ మండలా ధ్యక్షుడు బగాది శేషగిరి తెలిపారు. టెక్కలికండ్రవీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీకార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంఐదేళ్లలో అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచిందని, భూకబ్జాలు, మైనింగ్ మాఫియాలతో చెలరేగిపోయారని ధ్వజమెత్తారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి: ఆర్డీవో


పలాస రూరల్: అధికారులతో మాట్లాడుతున్న భరత్‌నాయక్

పలాస రూరల్: అన్ని రాజకీయపార్టీలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని, ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా అధికారులు పనిచేయాలని పలాస ఆర్డీవో డాక్టర్ భరత్‌నాయక్ తెలిపారు. శనివారం పలాస తహసీల్దార్ కార్యాలయంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్లతో ఎన్నికల నియమావళి అమలుపై సమీక్షించారు. రాజకీయ పార్టీలు తప్పనిసరిగా నియమావళిని పాటించాలని, పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు తొలగించాలని అధికారులు ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై 6302384049 నంబరుకు ఫిర్యాదుచేయాలని తెలిపారు. సీ విజిల్‌యాప్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్‌వీఎస్‌నాయుడు, మునిసిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, డీటీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఉద్యోగులపై చర్యలు

జలుమూరు: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ తెలిపారు. శనివారం జలుమూరు మండలపరిషత్ సమావేశ భవనంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వోద్యోగులు రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీల్లో పాల్గొన్నట్లు రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో ఎ.దామోదరరావు, ఎంసీసీ కృష్ణారావు పాల్గొన్నారు.

● **హిరమండలం:** ఎన్నికల నియమావళిని పగడ్బందీగా అమలు చేయాలని, ఎక్కడ వివాదాలకు తావివ్వద్దని తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో స్వరూపరాణి కోరారు. హిరమండలం మండలపరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులుతో సమావేశం నిర్వహించారు.

●**మెళియాపుట్టి:**ఎన్నికల నియమావళిని అన్నిశాఖలుఅధికారులు, సిబ్బంది పాటించాలని ఎంపీడీవో జి.భాస్కరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎస్ఐరాజేష్, ఎంఈవోలు దేవేంద్రరావు,వైద్యాధికార్లుగ్రీష్మ, హేమంత లక్ష్మి తదితర అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు.

ఎన్నికల కోడ్ అమలు.. ఫ్లెక్సీల తొలగింపు


హిరమండలంలో ప్రభుత్వ పథకాల గోడపత్రికను తొలగిస్తున్న పంచాయతీ కార్యాలయం సిబ్బంది

నరసన్నపేట/ పాతపట్నం/ నందిగాం/ హిరమండలం/ మెళియాపుట్టి: జిల్లాలో సాధారణ ఎన్నికలకు సంబంధించి శనివారం కోడ్ అమలులోకి రావడం వల్ల రాజకీయ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. నరసన్నపేట, పాతపట్నంలోని ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ నాయకులు ఫొటోలు, వివిధ ఫ్లెక్సీలను సచివాలయ, పంచాయతీ సిబ్బంది నిమగ్నమయ్యారు.ఇటీవల పట్టణంలో భారీస్థాయిలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటుచేశారు. దీంతో వాటిని తొలగించేందుకు పంచాయతీ సిబ్బంది చర్యలుచేపట్టారు.మండలపరిషత్, తహసీల్దార్ వెలుగు తదితర కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చిత్రపటాలు, స్పందన ఫ్లెక్సీలు, గోడపత్రికలు అధికారులు తొలగించారు. మెళియాపుట్టి మండలంలోని వసుంధరలోరాజకీయపార్టీలకు సంబంధించిన బ్యానర్లను ఎంపీడీవో జి.భాస్కరరావు ఆధ్వర్యంలో తొలగించారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో బ్యానర్ల ఏర్పాటుకు ఎన్నికల అధికారుల అనుమతులు తీసుకోవాలని తెలిపారు. కాగా గ్రామాల్లో ఉన్న ప్రచార బోర్డులు, వివిధ శిలాఫలకాలపై ఉన్న వాటిని తాత్కాలికంగా కనిపించకుండా చేయాలని నరసన్నపేట ఎంపీ డీవో జి.రామకృష్ణ సచివాలయ సిబ్బంది ఆదేశించారు. వీఆర్వోలు, కార్యదర్శులకు గ్రామస్థాయిలో పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, గోడపత్రికలు తొలగించడంతో పాటు గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగాలని నందిగాం ఎంపీడీవో జి.శివప్రసాద్,తహసీల్దార్ పద్మావతి సూచించారు.

సొండిపూడిలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ

● తమ్ముడు మృతి


నీలాద్రి(ఫైల్)

హరిపురం:మందస మండలంలోని సొండిపూడిలో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో తమ్ముడు మృతిచెందాడు. కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు కథనం మేరకు... సొండిపూడి బీసీకాలనీకి చెందిన అన్నదమ్ములు లైశెట్టికూర్మారావు, నీలాద్రి భూమికోసంతరచూ ఘర్షణ పడుతున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం రాత్రి పదిగంటల సమయంలో ఇద్దరి మధ్య వాదోపవాదనలు జరిగి కొట్లాటకు దారితీసింది. దీంతో ఇద్దరుకర్రలతో కొట్టుకోవడంతో తమ్ముడు నీలాద్రి తలపై బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. తల్లి లక్ష్మమ్మ కుమారుడి పరిస్థితిచూసి విలపిస్తూ కేకలు వేసింది. చుట్టు పక్కల వారంతా చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న నీలాద్రిని హరిపురం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కూర్మారావును శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవుపురం మాజీ సర్పంచ్ మృతి

నందిగాం:దేవుపురం మాజీసర్పంచ్ శిష్టు గున్నయ్య శనివారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం టెక్కలి జిల్లాకేంద్రాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. కొండతెంబూరులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. భార్య సరోజిని,ముగ్గురు కుమార్తెలు ఉండగా వారికి వివాహమయ్యింది. గున్నయ్య మృతికి టీడీపీ నాయకులు పినకాన అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, స్థానిక ఎంపీటీసీ సభ్యులు యర్ర చక్రవర్తి తదితరులు సంతాపం తెలిపారు.

ప్రిన్సిపాళ్లగా బాధ్యతల స్వీకరణ

జలుమూరు: జిల్లాలోని పలు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. జలుమురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జె.హారిక బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో బోటనీ జేఎల్‌గా పనిచేసిన హారిక పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డి.వేణుగోపాలరావు వ్యవహరించేవారు.

పలాస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కుప్పిలి నర్సింహమూర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎచ్చెర్ల జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేశారు. పదోన్నతిపై పలాస కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

తాగునీటి బోర్లకు శంకుస్థాపన

సంతబొమ్మాళి: మండలంలోని దిబ్బలమరువాడలో మంచినీటి బోర్ల ఏర్పాటుకోసం సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. తీర గ్రామాల్లో వేసవిలో నీటిఎద్దడి నివారణకు మంచినీటి బోరులు తవ్విస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత కార్యదర్శి సూరాడ దాసురాజు ఉప సర్పంచ్ సుగ్గు సీతయ్య పాల్గొన్నారు.

21న అప్పలసూరి స్మారకసభ

సంతబొమ్మాళి:కోమర్తిలో ఈనెల 21న నిర్వహించనున్న కామ్రేడ్ మామిడి అప్పలసూరి స్మారకసభ జయప్రదంచేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ కోరారు. శనివారం మండలంలోని వడ్డితాండ్రలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సన్నశెట్టి రాజశేఖర్, నంబూరి వెంకటరావు, ఎస్.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

హిరమండలం: సుభలయ ఆర్‌ఆర్ కాలనీ పంచాయతీలో టీటీడీనిధులతో శివాలయం నిర్మాణానికి దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు శనివారం ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులు గ్రామస్థులకు తెలిపారు.

గోర్జిలో ఆక్రమణల తొలగింపు

నరసన్నపేట: నరసన్నపేటలోని జాతీయ రహదారి పక్కనేగల మేఘన హోటల్‌కు సమీపంలో గొట్టిపల్లి సర్వేనెంబరు 180/1లో గల 0.58 సెంట్లు ప్రభుత్వ గోర్జిలో ఆక్రమణలను తొలగించారు. ఇక్కడ ఆక్రమించి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రోడ్డు నిర్మిస్తుండడంతో పంచాయతీ అధికారులు శనివారం అడ్డుకున్నారు. ఈ స్థలంలో కొన్ని ప్లాట్లు కూడా ఉన్నట్లు గుర్తించారు. సబంధిత స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఈవో చిన్నారావు తెలిపారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

టెక్కలి: నౌపడా ఆర్‌ఎస్ ఎట్ తలగాం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పలువురు విద్యార్థులకు బిగ్‌హెల్ప్ సంస్థ ప్రతినిధులు పౌష్టికాహారం, కాస్మోటిక్స్ సామగ్రిని శనివారం అందజేశారు.కార్యక్రమంలో హెచ్ఎం ధర్మారావు, రామముని రమేష్‌కుమార్, కృష్ణారావు, ఉపాధ్యాయులు విద్యావతి, లత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సైకోపాలనను ఇంటికి పంపించాలి: బగ్గు


బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

నరసన్నపేట: రాష్ట్రంలో సైకోపాలన అంతం కావడానికి ఎన్నికల కోడ్‌తో బీజం పడిందని నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకావడంతో నరసన్నపేటలోని టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలనను తెరదించే సమయం ఆసన్న మైందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, బెవర రాము, కింజరాపు రామారావు, సరియపల్లి ముద్దుప్రహర్ష, మోహన్, నీలం పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

● మందస మండల టీడీపీ అధ్యక్షుడు బావన దుర్యోధన


జిల్లుండలో టీడీపీ, జనసేన జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

హరిపురం: ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మందస మండల టీడీపీ అధ్య క్షుడు బావన దుర్యోధన పిలుపునిచ్చారు. మందస మండలం జిల్లుండలో శనివారం టీడీపీ, జనసేన జెండాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో టీడీపీ, జనసేన ఉమ్మడి జెండాలను ఎగురవేసి పార్టీని అధికారంలోకి తీసుకురా వాలన్నారు.గౌతు శిరీషా గెలుపుకోసం గ్రామస్థాయిలో శ్రమించాలని కోరారు.కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు బాస్కరరావు, జీకేనాయుడు, రట్టి లింగరాజు, చంద్రశేఖర్, డొంకూరు తిరుపతిరావు పాల్గొన్నారు.

నవగ్రహాలయ వార్షికోత్సవం

నరసన్నపేట: స్థానిక ఉమామహేశ్వరాలయ ప్రాంగణంలోగల నవగ్రహాలయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఆలయ దాత మార్పు విజయ్ ఆధ్వర్యంలో అర్చకులు వసనాభి గణేష్ నవగ్రహ మండపానికి విశేష పూజలు జరిపారు.

ఎరుకమ్మ ఆలయంలో ఎలుగుబంటి


ఆలయంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

వజ్రపుకొత్తూరు: మండలంలోని బాతుపురం గ్రామానికి సమీపంలో గల ఎరుకమ్మ అమ్మవారి ఆలయం వద్ద శనివారం మధ్యాహ్నం ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. ఆలయం వద్దకు ఎలుగుబంటి రావడంతో అటుగా వచ్చిన రైతులు, ప్రజలు భయాందోళనచెందారు. చాలాసేపు వరకు ఆలయం వద్ద ఉండిపోవడంతో ప్రజలు అటుగా వెళ్లేందుకు సహసించలేదు. ప్రజలు గుమిగూడి కేకలు వేయడంతో పక్కనే ఉన్న తోటల్లోకి వెళ్లిపోయనట్లు స్థానికులు చెప్పారు.

బీజేపీలో తేజేశ్వరరావు చేరిక


కండువావేసి బీజేపీలోకి తేజేశ్వరరావును ఆహ్వానిస్తున్న పురందేశ్వరి

పాతపట్నం: పాతపట్నానికి చెందిన సిరిపురం తేజేశ్వరరావు బీజేపీలో శనివారం చేరారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆహ్వానించారు. అనంతరం పార్టీ క్రియాశీల సభ్యత్వాన్ని అందజేశారు. ఈసందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ తేజేశ్వరరావు వంటి విద్యావేత్త పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. తేజేశ్వరరావు మాట్లాడుతూ దేశప్రధాని మోదీ నాయకత్వానికి ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, దేశాన్ని విశ్వగురువుగా నిలిపిన ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వపటిమనచ్చి పార్టీలో చేరినట్లు చెప్పారు. జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు.

పాతపట్నంలో బోరుకు మరమ్మతులు

పాతపట్నం: స్థానిక జగనన్నకాలనీలో మొరాయించిన బోరుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆంధ్రజ్యోతిలో ఈనెల 6న బోరుకు మరమ్మతుచేపట్టరూ శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఈమేరకు ఏఈకల్యాణ్ ఆధ్వర్యంలో బోరుకు మరమ్మతుచేసి నీటిసరఫరా పునరుద్ధరించారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


నందిగాం హైస్కూల్ కేంద్రంలో పరీక్ష ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

జలుమూరు: జలుమూరు జీజేసీ, చల్లవానిపేట ఉన్నతపాఠశాల, విజ్ఞాన దుర్గా హైస్కూల్, శ్రీముఖలింగం, తిమడాం ఉన్నతపాఠశాలల్లో సోమవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో బి.మాధవరావు తెలిపారు. 738 మంది పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.● **నందిగాం:** నందిగాం ఉన్నతపాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, నర్సిపురం, నౌగాం ఉన్నతపాఠశాలలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు చీఫ్‌సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ● **ఎల్.ఎన్.పేట:** లక్ష్మీనర్సుపేట జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఎంఈవోలు మణికుమార్, కె.చంద్రమౌళి తెలిపారు. కరకవలస జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 63 మంది, లక్ష్మీనర్సుపేట జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 112 మంది, రావిచెంద్రి జడ్పీ ఉన్నత పాఠశాలనుండి 13 మంది, పూశాం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 20మంది, కేజీబీవీ పాఠశాల నుంచి 38మంది, వెంకటేశ్వర(ప్రైవేటు) స్కూల్ నుంచి తొమ్మిది మంది పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

చలో విశాఖకు తరలివెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు

టెక్కలి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటకమిటీ నిర్వహిస్తున్న బహిరంగసభకు శనివారం నౌపడా రైల్వేస్టేషన్ నుంచి రెండు బోగీల్లో చలో విశాఖకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. సేవ్ వైజాగ్-సేవ్ స్టీల్‌ప్లాంట్ నినాదంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పరమేశ్వరరావు చెప్పారు.

అర్ధరాత్రి ఉత్తర్వులు.. హడావుడిగా శంకుస్థాపన

పోలాకి: జగతిమెట్ట స్వయంభూశివాలయ అభివృద్ధికోసం రూ. 70 లక్షలతో పర్యాటకశాఖ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధులతో ఎన్నికల కోడ్ జారీకి రెండుగంటల ముందు హడావుడిగా శనివారం జగతిమెట్ట నుంచి దుబకవానిపేట వరకు బీటీ రహదారిపనులకు ఎమ్మెల్యే కృష్ణదాస్ శంకుస్థాపన చేశారు. దుబకవానిపేటకు గతంలో నిర్మించిన బీటీ రోడ్డు గోతులమయమైంది. ఈనేపథ్యంలో ఆలయఅభివృద్ధి కోసం పర్యాటక శాఖ వెచ్చించిన నిధులు రహదారికి మళ్లించడంపై విమర్శలొస్తున్నాయి.

తాగునీటి సమస్యపై చర్యలు తీసుకోండి

●పలాస-కాశీబుగ్గ మునిసిపల్ టీడీపీ కౌన్సిలర్ల డిమాండ్


మాట్లాడుతున్న సూర్యనారాయణ

పలాస:జంటపట్టణాల్లో తాగు నీరందించలేని స్థితిలో ఉండడం విచారకమని, దీన్ని తక్షణం పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి డిమాండ్‌చేశారు. శనివారం పలాస-కాశీబుగ్గ మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన పాలకమండలి అత్యవస సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సూర్య నారాయణ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల బోర్లు పాడయ్యాయని, ఇంటింటా తాగునీరు సరఫరా చేయలేకపోతున్నారని, కనీసం వాటి మరమ్మతులకు కూడాచర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. జోగ త్రివేణి మాట్లాడుతూ రాజమ్మకాలనీలో నవంబరు నుంచే నీటి ఎద్దడి ప్రారంభమైందని తెలిపారు. పైలెట్ స్కీమ్‌ల ద్వారా నీరు రావడం లేదని, బోర్లు వేయాలని రెండేళ్ల నుంచి కోరుతున్నా చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. కాగా బోర్లు మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్ టి.నాగేం ద్రకుమార్ తెలిపారు. బెల్లాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కాశీబుగ్గలో అనధికారికంగా కాలువపై టి షాపు తొలగించాలని కోరారు. పప్పలప్రసాద్ మాట్లాడుతూ టెలీకం కార్యాలయం వద్ద కాలువ పూడుకుపోయి నీరురోడ్డుపై ప్రవహిస్తోందని, ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ కనకరాజు, ఏఈ అవినాష్, వైస్‌చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, డిక్కల ఆనందరావు, డొక్కరి తులసీ, జోగారావు పాల్గొన్నారు.

టెక్కలిపట్నంలో జామి ఎల్లమ్మ యాత్ర

పలాస రూరల్ :మండలంలోని టెక్కలిపట్నంలో జామిఎల్లమ్మయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఆవరణలో యాత్ర సందడిగా జరిగింది. భక్తులకు అవస్థలకు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు.

సోషల్ ఆడిట్ నివేదిక అప్‌లోడ్ చేయాలి

నరసన్నపేట: ప్రభుత్వపాఠశాలల సోషల్ ఆడిట్ నివేదికను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు సూచించారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. పదోతరగతి పరీక్షల సంబంధించిన ఇన్విజిలేటర్లు మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.

